

పెనుమాక నాగేశ్వరరావు

లేదనేది

పుస్తకాల్లో చదివినప్పుడూ, సినిమాల్లో డైలాగ్‌గా విన్నప్పుడూ సంతోషంగా వుంటున్నది కాని స్వానుభవంలోకి వచ్చినప్పుడు, ఆ భావాన్ని ఆచరణలో పెట్టాల్సి వచ్చినప్పుడూ అది వీలు కావటం లేదు మనిషికి. అది అంత సులభమైన విషయమైతే మనిషెట్లా అవుతాడు? మనీషి అయిపోడు!

ఆకస్మిక ధనలాభం ఎవ్వరికయినా అనందాన్ని ఇస్తుంది. అయితే ఆ వచ్చిన దానికి సంతోష పడటం సబబుగా వుంటుంది కానీ ఇంకా వచ్చి వుంటే ఎంత బాగుండేదో అని పగటి కలలు కంటూ ఆ ఎక్కువ మొత్తం రానందుకు ఏడుస్తూ కూర్చోవటం అవివేకం గాక మరేమవుతుంది? ఇంకా చెప్పాలంటే అత్యాశ; దురాశ లేదా మూర్ఖత్వం అవుతుంది. వచ్చినవరకే మనకు ప్రాప్తం వుందనుకోవటంలో వున్న సుఖం, రాని దానికోసం విచారిస్తూ

**ప**ది లక్షలు వచ్చాయన్న మాటేగానీ పట్టుమని పది నిమిషాలు కూడా ప్రశాంతంగా గడపలేకపోతున్నాడు శంకర్రావ్. ఇంట్లో ఉన్నంతసేపూ ఉష సాధింపు, వేధింపు భరించలేక పోతున్నాడు. తృప్తికి మించిన ధనం కూర్చోవటంలో వుంటుందా?' మనిషికి మనసే తీరని శిక్షా, దేవుడిలా తీర్చుకున్నాడు కక్షా' అన్న కవిగారి వాక్యాలు స్ఫురణకు వచ్చినయ్ శంకర్రావుకు. అతగాడి ఆలోచనలు ఇలా సాగుతూ వుంటే.....

"అవకాశం అనేది జీవితంలో ఒక్కసారే మన తలుపు తట్టి వస్తుంది. అలా వచ్చినప్పుడే మన తెలివి తేటల్ని ఉపయోగించి దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అసమర్థులకు అవకాశం వచ్చినా ఉపయోగించుకోవటం చేతకాకపోతే ఇలాగే

ఉంటుంది. తృప్తి, సంతృప్తి, ప్రాప్తం, యోగం అంటూ చేతకాని మాటలు చెప్తూ తమ చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు'' ఉష వాదన ఇలాంటి వాగ్బాణాలతో కొనసాగుతున్నది.

"సరే నేను చేతగాని వాడ్నే. నా అసమర్థత వల్లనే మనకి వచ్చే మరో పన్నెండు లక్షలూ రాకుండా పోయినై.... ఇప్పుడేం చేద్దాం అంటావ్'' ఉక్రోషం ధ్వనించింది శంకర్రావ్ గొంతులో.

"ఏమంటాను.... నోరు మూసుకుని కూర్చుంటాను. మీరు చేసే పనులన్నింటికీ అలా నోరు, కళ్లు మూసుకుని కూర్చోవటం అలవాటు చేసుకోకపోతే మనశ్శాంతిగా బ్రతకటం కష్టం.'' నిష్ఠూరంగా అన్నది ఉష.

"ఏదో భగవంతుడి దయ వల్ల అవకాశం వచ్చింది. మనం ఊహించనంత మొత్తం వచ్చింది. దాన్నో ప్లాను ప్రకారం వినియోగించుకుని, మనకి, పిల్లలకి కూడా భవిష్యత్తులో కాస్తంత ప్రయోజనం వుండేటట్లు చూసుకోవాలిగానీ, ఇంకా ఏదో వచ్చేది, అది సొంతం చేసుకో లేకపోయామంటూ వాపోతూ, రోజుకు నాలుగు సార్లు నన్ను తిట్టిపోసుకుంటూ కూర్చుంటే లాభమేంటి చెప్పు'' అనునయంగా చెప్పాడు శంకర్రావ్.

"ఇదిగో మీరిలా శాంతి వచనాలు వల్లిస్తూ అనవసరంగా నాకు కోపం తెప్పించకండి. మన వల్ల కాలేదు, పొరబాటు జరిగిపోయింది. అంతే.... అలా ఒప్పుకోండి బాగుంటుంది. ప్లాను ప్రకారం చేస్కోవాలట, ప్లాను ప్రకారం..... అంత ప్లానులు, ప్రణాళికలు వుండుంటే మన కొంప ఇలా తగలడేదా! ఏనాడో బాగు పడుండేది. మాటలు చూస్తే కోటలు దాటతాయి. చేతకానప్పుడు చేతగానట్లుండాలి, చెప్పిన మాట విని తగు నిర్ణయం తీసుకోవాలి. ఆడదాని మాటేమిటి మనం వినేదనే పొగరు, అహంకారం... ఏమున్నా లేకపోయినా వీటికి మాత్రం తక్కువేం లేదు'' ఉష ధోరణిలో మార్పు లేదు.

"మన పెళ్లయిన మూడో సంవత్సరం.... అదే మన పెద్ద పాప పుట్టిన సంవత్సరం.... దాని అక్షరాభ్యాసం రోజున మామగారు అర ఎకరం పొలం అమ్మకానికి పెట్టానన్నప్పుడు నేనేం చెప్పేను. ఆ సొసైటీ లోనో, మరొక లోనో తీసుకుని ఆ అర ఎకరం పొలం కొనండి పాప పేరుతో. అది పెద్దయ్యాక పొలం ధర పది రెట్లో, పన్నెండు రెట్లో వస్తుంది. దాని చదువుకు డబ్బు వెతుక్కోకుండా సరిపోతుందీ అని చెవిలో ఇల్లు కట్టుకుని పోరేను. విన్నారా?.... ఇప్పుడు చూడండి... ఆనాడు ఆరు వేలకు అమ్మిన పొలం ఇప్పుడు ఎనభై వేలంటున్నారు.... ఏం లాభం? చెబితే వినడు, గిల్లితే ఏడుస్తాడని వూరకే అన్నారా!''

"అవునే నేను చాదస్తుడ్నే.... నాకు డబ్బు ప్రధానం కాదు. తండ్రి దగ్గర పొలం కొనుక్కోవటమనే మాటే వినడానికి అపసవ్యంగానూ, అసహ్యంగానూ భావించే వాడ్ని నేను. చేతనైతే ఆయన అవసరానికి ఆదుకోవాలి లేకపోతే నోరు మూసుకుని చేతులు ముడుచుకుని కూర్చోవాలి. నిజంగా మనలో నిజాయితీ వుంటే ఆయనకు అవసరమైన ఆరువేలు నువ్వు చెప్పినట్లు ఏ సొసైటీ లోనో, కాకపోతే ఏ మార్వాడి దగ్గరో తల తాకట్టు పెట్టయినా తెచ్చి ఇచ్చివుండాల్సిందిగానీ మనమే ఆయన దగ్గర పొలం కొనటానికి సిగ్గంటూ వుండొద్దూ'' కాస్తంత పౌరుషంగానూ అంతకు మించి బాధగానూ అన్నాడు శంకర్రావ్.

"ఇదిగో ఇలాంటి మాటలే నన్ను రెచ్చగొట్టేది. ఈ సెంటిమెంట్లూ, ఎటాచ్‌మెంట్లూ పట్టుకుని వేలాడితే ఎదుగూ బొదుగూ లేకుండా..... ఇదిగో... మనం ఉన్నట్లే ఉన్న చోటనే ఉలుకూ పలుకూ లేకుండా పడివుంటారు ఎవరైనా.... నేను సిగ్గు లేని దాన్ని కాబట్టే ఇంకా మిమ్మల్ని మీ ఆలోచన్లని మార్చాలని ప్రయత్నం చేస్తున్నాను. ఇదంతా నా కోసం కాదని తెలుసుకోండి. మన పిల్లల కోసం ఇంకా మాట్లాడితే మీకోసం.... డబ్బు సంపాదిస్తున్నది, అందుకు కష్టపడుతున్నదీ మీరు, నాలుగు డబ్బులు వచ్చే మార్గం వున్నప్పుడు తెలివిగా వ్యవహరిస్తే మీకు నాకు, మన పిల్లలకే గదా అని నా ఏడుపు.... అంతకంటే ఏం లేదు'' అని ముక్కు చీది బాణీ మార్చింది ఉష.

నిజానికి ఆ స్థితిలో ఆమెని చూసి జాలి పడ్డాడు శంకర్రావ్.

"ఆ ప్రశ్నకు సమాధానం 'బి' కాదు సి అండీ అని చెప్తూనే వున్నాను.... పోనీ మీకు అంతగా నమ్మకం లేనప్పుడు నేను అంత గట్టిగా చెప్తుంటే నా మాట వినొచ్చు గదా.... నేను బలవంతం చేస్తున్నా నా మాట విన్లేదు మీరు. సరిగ్గా ఆ సమయంలో అమితాబ్ నా వంక ఎంత జాలిగా చూశారో తెల్సా..... గబుక్కున క్విట్ అని చెప్పేస్తిరి.... చివరకేమయింది గెస్ ఆన్సర్‌లో మీరు బి చెప్తే కరెక్ట్ ఆన్సర్ సి అని వచ్చింది. ఆ ఒక్క ప్రశ్న చెప్పి వుంటే పాతిక లక్షలు వచ్చేవి. అప్పుడు క్విట్ చెప్పి బయట పడే వాళ్లం'' మరోసారి తన ఆవేదనని వెళ్లగక్కింది ఉష.

"నువ్వెన్ని సార్లు బాధపడినా అయిపోయిందేదో అయిపోయింది తప్పు మళ్లీ సరి దిద్దుకునేది కాదు. ఆ టైములో నువ్వు చెప్తున్నవి కరెక్ట్ ఆన్సర్ అనే నమ్మకమూ కలగలేదు అది చెప్పేందుకు ధైర్యమూ చాల్లేదు. ఏం చేయమంటావ్ చెప్పు.... ఒకవేళ నువ్వు చెప్పింది తప్పునుకో ఏమయ్యేది మూడు లక్షలు తీసుకుని బయటకు వచ్చే వాళ్ళం.... ఇప్పుడు అంతకన్నా బెటర్ కదా.''

"మీరు ఎన్నన్నా చెప్పండి.... నా మాటంటే మీకసలు లెక్క లేదండీ. దీనికేం తెల్సులే దీని ముఖం అనుకుంటారు. అంత నిర్లక్ష్యం పనికి రాదు. అది తెలుసుకోండి. నా మాట క్కూడా కాస్త విలువివ్వటం నేర్చుకోండి'' అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోసాగింది ఉష.

"అలాగే.... అలాగే.... ఇంకోసారి మనకివిదే అవకాశం వస్తే ఆన్సర్లన్నీ అమ్మగారి చేతనే చెప్పిస్తా.... సరేనా''

"ఆ వేళా కోళమే నాకు చిర్రెత్తించేది''

"అంత కోపం వద్దుగాని మనిద్దరం ఓ ఒప్పందం కుదుర్చుకుందాం....''

ఏమిటన్నట్లు చూసింది భర్త కళ్ళల్లోకి ఉష.

"నీ కారణంగా మనకి అయాచితంగా ఓ పది లక్షలు వచ్చినయ్. నా మూలంగా ఓ పది లక్షలు పోయినై (నీ అభిప్రాయం ప్రకారం) కాబట్టి ఈ వచ్చిన పదిలక్షలూ నీ ఇష్ట ప్రకారం ఖర్చు చేసుకో లేదా మొత్తం నీ పేరుతో నీ ఇష్టం వచ్చిన చోట డిపాజిట్ చేసుకో... నేనేం అభ్యంతరం చెప్పను.''

అతని మాటలు పూర్తయినయ్యో లేదో బావురు మంటూ భర్తను చుట్టేసుకున్న ఉష పసి పిల్లలా ఏడ్చేసింది.

ఆమె ఏడుపు తన మాటల్తో భర్తను బాధించినందుకూ కావచ్చు, భర్త తనని డబ్బు మనిషిగా భావించినందుకూ కావచ్చు.

ఎలాగయితేనేం కథ సుఖాంతమైంది. ఒకర్నొకరు దెప్పి పొడుచుకుంటూ, తప్పు లెన్నుతూ, తగూలాడుకుంటూ ప్రారంభమైన ఆ ఆలుమగలిద్దరూ లక్ష్మి ప్రసన్నంతో ఆరంభమైన అవగాహనా లోపాన్ని సరిదిద్దుకుని, సర్దుకుని ఒకరి కొకరు అనుకూలంగా ఆలోచించుకుని ఆనంద పరవశులయ్యారు.

❋